www.prajasakti.com
ప్రజాశక్తి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం 23 జులై 2023



ధర్నాను జయప్రదం చేయండి : ఆవాజ్

ప్రజాశక్తి-నెల్లూరు: ముస్లిం మైనారిటీ సమస్యలపై ఈనెల 24న సోమవారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రఫీద్ పిలుపు నిచ్చారు. శనివారం ఉదయం స్థానిక బాలాజీ నగర్ లోని రామచంద్ర రెడ్డి భవన్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ధర్నా పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వైసిపి ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు ఎన్నో హామీలు ఇచ్చిందన్నారు. అందులో అమలుకు నోచుకోనివి చాలా ఉన్నాయన్నారు. ఆ సమస్యల పరిష్కారం కోసమే ధర్నా జరుగుతుందన్నారు. జయప్రదం చేయాలన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ చాన్ బాషా, షేక్ ఫయాజ్, షేక్ నజీర్ భాష, షేక్ చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆవాజ్ నాయకులు

నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న ఆరుగురు రోగులు ఒకే రోజు మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్సకు అవసరమైన పరికరాలు, మందులు అందు బాటులో ఉండవనే ప్రచారం ఉంది. ఇలాంటి సమయంలో ఇటువంటి సంఘటనలు ఆసుపత్రి ఉనికికే ప్రమాదంగా మారుతున్నాయి.శుక్రవారం జిజిహెచ్‌లో ఆరుగురు మృతి చెందగా శనివారం వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాలతో వైద్యాధికారులు విచారణ జరిపారు. చికిత్స పొందుతూ మృతి చెందారని ఎలాంటి నిర్లక్ష్యం లేదని తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

జిజిహెచ్‌లో కలకలం..!

- ఒకే రోజు ఆరుగురు మృతి
- డిఎంఅండ్‌హెచ్‌ఒ విచారణ
- కలెక్టర్ సందర్శన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి, వైద్యశాఖ జిల్లాకు తలమానిక. నూతనంగా రూ.380 కోట్లతో వైద్యశాల, కళాశాల ఏర్పాటు చేశారు. భారీగా నూతన పరికరాలు పెట్టారు. మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్స్‌రే, స్కానింగ్, ఎంఆర్ స్కాన్ వంటి కీలకమైన పరికరాలు మూలన పడ్డాయి. పది లిఫ్టులు ఉండగా, కొద్ది రోజులుగా పనిచేయలేదు. ఇటీవల కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాలతో వాటిని బాగుచేశారు. అప్పటి నుంచి ఆసుపత్రి పనితీరు పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉంది.ఇలాంటి సమయంలో జిజిహెచ్‌లో ఆక్సిజన్ అందక ఎనిమిది మంది చిన్నారులు మృతి చెందారని ఓ మీడియాలో వార్త ప్రచురితమైంది. దాని రాష్ట్ర వ్యాపితంగా సంచలనం కలిగించింది. కలెక్టర్ ఆదేశాలతో డిఎంఅండ్‌హెచ్‌ఒ పెంచలయ్య ఆసుపత్రికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే కలెక్టర్ జిజిహెచ్‌కు వెళ్లి పరిశీలించారు.మృతికి గల కారణాలు తెలుసుకోవాలని అధికారులను అదేశించారు.

ఒకే రోజు ఆరుగురు మృతి...!

ఒకే ఒకేరోజు ఆరుగురు రోగులు మృతి చెందండం కలకలం సృష్టించింది. శుక్రవారం ఒక్కరోజే ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ కారణాలతో ఆరుగురు మృతి చెందారు. వివిధ రకాల జబ్బులతో వారం రోజుల నుంచి జిజిహెచ్‌లో చికిత్స పొందుతోన్న వారి మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. ఎంఐసియు యూనిట్‌లో చికిత్స పొందుతోన్న ఆరుగురు వివరాలు తెలుసుకున్నారు. ఉదయం 9.33 నుంచి సాయంత్రం 6.28 గంటల మధ్యలో మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. సాంబయ్య (60) 20వతేదీ ఆసుపత్రిలో చేరారు. గుండె సంబంధించిన వ్యాధితో ఆయన చికిత్స పొందుతూ 21వ తేదీ ఉదయం 9.33 గంటలకు మృతి చెందారు. నెల్లూరు నగరం సౌత్‌హౌస్‌పేటకు చెందిన ఎన్. లీలావతి, (62) 19వ తేదీ రాత్రి 9.5 గంటలకు జిజిహెచ్‌లో చేరారు. 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మృతి చెందారు. నెల్లూరు నగరంలోని నరుకూరుకు చెందిన పి.రమేష్ (42) ఈనెల 13న 12.28 గంటలకు ఆసుపత్రికి వచ్చారు. 21వ మధ్యాహ్నం 3.23 గంటలకు మృతి చెదారు. నెల్లూరునగరంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఎన్. చలపతి (52) 20వతేదీ రాత్రి 8.54 గంటలకు ఆసుపత్రిలో చేరారు. 21వ తేదీ సాయంత్రం 5.15 గంటలకు మృతి చెందారు. నెల్లూరు నగరంలోని వేదాయపాలెం వై. సుందరం (70) 17 వతేదీ ఉదయం 10.44 ఆసుపత్రికి వచ్చారు. 21వ తేదీ రాత్రి 6.23గంటలకు మృతి చెందారు. నెల్లూరు కోటమిట్ట ప్రాంతానికి చెందిన చెంచమ్మ (70) 21 మధ్యాహ్నం 2.09 గంటలకు ఆసుపత్రిలో చేరారు. 21 రాత్రి 6.28గంటలకు మృతి చెందారు. వివిధ కారణాలతో ఒకే రోజు జిజిహెచ్‌లో ఆరుగురు మృతి చెందారు. కారణాలు ఏమైనా మృతికి కారణాలు విచారించాల్సి ఉంది. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందుతుందా.. చికిత్స సరిగా అందక మృతి చెందారా అనే విషయాలు తెలియాల్సి ఉంది. అధికారులు సమగ్ర విచారణ జరిపితే విషయాలు బయటకొచ్చే అవకాశం ఉంది.

ఇది సాధారణ మరణాలే..డిఎం అండ్‌హెచ్‌ఒ

జిజిహెచ్‌లో ఆక్సిజన్ అందక మృతి చెందారని ప్రచారం చేశారని ఇందులో ఎలాంటి వాస్తవం లేదని డిఎంఅండ్‌హెచ్‌ఒ పెంచలయ్య తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడారు. ఆసుపత్రిపై వచ్చిన వార్తలు అవాస్తవమని, రోగులు చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. ఆక్సిజన్ అందక చనిపోయారని దుష్ప్రచారం చేయడం తగదన్నారు. లిక్విడ్ ఆక్సిజన్ చెన్నయ్ నుంచి వస్తుందని, మూడు ట్యాంకర్లు ఉన్నాయని ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చివర దశలో ఇంటికి తీసుకెళ్తామంటే జిజిహెచ్‌కు తీసుకొస్తున్నారన్నారు. వారం రోజులతో పాటు మృతుల వివరాలను ఆయన వివరించారు. 17వ తేదీ ఒకరు, 18న నలుగురు, 19న ఇద్దరు, 20న ముగ్గురు, 21న ఆరుగురు, 22న నలుగురు మృతి చెందారని తెలిపారు.జిజిహెచ్‌లో మృతులపై సమగ్ర విచారణ జరపాలని ప్రజా సంఘాలు, రాజకీయపార్టీల నాయకులు డిమాండ్ చేశారు.

సచివాలయంలో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు: స్థానిక 35/2 బషీర్ నగర్ వార్డు సచివాలయాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ శనివారం తనిఖీ చేశారు. సచివాలయంలోని ఇన్‌వర్డ్, రిజిస్టర్, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాట్లను అన్ని సచివాలయాల్లో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవంగా అందరికీ చేరువయ్యేలా సచివాలయం సెక్రెటరీలకు సూచించారు. సచివాలయంలో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని పలు విభాగాల కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రపంచ మెదడు దినోత్సవాన్ని పురస్కరించుకొని "మెదడు ఆరోగ్యం, వైకల్యం ఎవరినీ వదిలిపెట్టదు" అనే నినాదంతో నారాయణ హాస్పిటల్, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఎస్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మూర్ఛ, మైగ్రేన్, డిమెన్షియా, మతిమరుపు, పక్షవాతం తదితర మెదడు రుగ్మతల గురించి, డావ ఎస్.ఎస్. సంపత్ కుమార్ గారు ప్రజలకు మరియు హాస్పిటల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. వైద్యశాల డిజిఎం, డాక్టర్ రాధిక, మార్కెటింగ్ విభాగంలోని పి.ఆర్.ఓలు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్ ఘటనపై
న్యాయ విచారణ చేపట్టాలి
సిపిఎం రూరల్ కమిటీ డిమాండ్

జిజిహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : జిజిహెచ్ లో 8 మంది రోగులు మృతి చెందిన ఘటనపై న్యాయవిచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రూరల్ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ప్రభుత్వ జిల్లా ప్రధాన వైద్యశాలలో ఒకే రోజు ఎనిమిది మంది చనిపోవడం ఘటనపై ప్రభుత్వం విచారణ చేపట్టాలం టూ సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో జిజిహెచ్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య మాట్లాడూతూ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. విచారణలో ఆక్సిజన్ సరఫరా ఆగిపోయినం దువల్ల పేషెంట్లు చనిపోయినారని తేలితే ఒక్కొక్క కుటుంబానికి 20 లక్షలు ఎక్స్ గ్రేషియా అందజేయాలన్నారు. ఒకే రోజు 8 మంది రోగులు మృతి చెందడం విచారకరమన్నారు. పెద్ద ఆస్పత్రికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది రోజు పేషెంట్లు వస్తుంటారన్నారు. పేషెంట్లకు సరైనటువంటి మందులు , వైద్యసేవలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో లేక పోవడం వల్లనే ఇటువంటి మరణాలు సంభవిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అనారోగ్యంతో వైద్యసేవల నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన ఎంఆర్ఐ, సిటీ స్కాను, ఎక్స్‌రే , బ్లడ్ టెస్ట్‌లు చేయకుండా ప్రయివేటు ల్యాబ్‌లకు వెళ్లి చేయించుకురావాలని వైద్యులు చెప్పడం దారుణమన్నారు. సిపిఎం రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కిన్నెర కుమార్ మాట్లాడుతూ పెద్ద ఆస్పత్రిలో అనేక అవకతవకలు జరుగుతున్నాయన్నారు. ఘటనపై వెంటనే న్యాయ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు సంపత్ కుమార్ , ఎస్ డి రఫీ అహ్మద్ , నందిపాటి మాలకొండయ్య, నాయకులు ఎస్.కె కాలేశా, నరసింహారెడ్డి, ఎస్ కే .గౌస్ పీర్ ,ఎస్ కే బాజావలి, ఎస్ ఎం డి గయాజ్, ఖాదర్ బాషా , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకుచర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

త్వరలో నగరంలో జరిగే రొట్టెల పండుగ నేపథ్యంలో నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు బస్టాండు పరిసరాల్లో వాహనాల అక్రమ పార్కింగులను తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ట్రాఫిక్ పోలీసు విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆత్మకూరు బస్టాండు ఫ్లై ఓవర్ కింద చేపడుతున్న అభివద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను కమిషనర్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల అక్రమంగా రోడ్లపై పార్కింగులపై వచ్చిన ఫిర్యాదును పోలీసు అధికారులు, ఆర్ అండ్ బి, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో శనివారం పర్యటించిన కమిషనర్ స్థానికులతో మాట్లాడి రోడ్లను ఆక్రమిస్తూ ఏలాంటి వాహనాల పార్కింగులు చేయవద్దని సూచించారు. అనంతరం రొట్టెల పండుగ నిర్వహణ ఏర్పాట్లను బారా షహీద్ దర్గాలో కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న భక్తులను దష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్ అండ్ బి ఎస్.ఈ, ఏ.ఈ లు, ట్రాఫిక్ సి.ఐ, నగర పాలక సంస్థ యస్.ఈ.సంపత్ కుమార్ , డీ.సి.పి.దేవి కుమారి, ఆరోగ్య శాఖాధికారి వెంకట రమణ తదితరులు ఉన్నారు.

'నారాయణ'లో అరుదైన శస్త్ర చికిత్స

నెల్లూరు : పదిహేనేళ్లుగా హెర్నియా వ్యాధితో బాధపడుతున్న రోగికి నారాయణ హాస్పిటల్ వైద్యులు. విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ హాస్పిటల్ జనరల్ సర్జరీ విభాగంలోని వైద్యులు ప్రొఫెసర్ డాక్టర్ కెఎల్ సంపత్ కుమార్ మాట్లాడుతూ చల్లప్పుకు హెర్నియా బాగా ముదిరిపోయి, విపరీతమైన కడుపునొప్పితో వచ్చాడన్నారు. అవసరమైన వైద్య పరీక్షలు కడుపులో ఉండాల్సిన ప్రేగులు క్రిందకి జారిపోయి ప్రమాదకరంగా ఉండటాన్ని గుర్తించామన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చైతన్య కుమార్ రెడ్డి చల్లప్పుకు సుమారు 50 సెం. మీ పొడవు, 20 సెం. మీ వెడల్పుతో పెద్ద హెర్నియా సంచిలాగా తయారయ్యిందన్నారు.ఎంతో కష్టపడి శస్త్ర చికిత్స విజయవంతంగా చేశామన్నారు. నారాయణ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ ప్రణీత్, డాక్టర్ రంగస్వామి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -నెల్లూరు : తమ సెంటర్‌లో అనేక మంది తల్లుల కలలను నిజం చేసినట్లు నెల్లూరు నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో ని మాతత్వ సంతాన సాఫల్య కేంద్రం క్లినికల్ డైరెక్టర్, డాక్టర్ మిధుల తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించి వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. నేడు ఉచిత వైద్య శిబిరం మాతత్వ సంతాన సాఫల్య కేంద్రంలో జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

300 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లూరు : నెల్లూరు కి చెందిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కిమ్స్ యాజమాన్యం స్థానిక కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఎస్ఇబి స్టేషన్ వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యల నివారణలో భాగంగా కందుకూరు పట్టణంలోని ఉప్పుచెరువు, ఏకలవ్య నగర్,బండపాలెం ప్రాంతాలలో అవగాహనా కార్యక్రమ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యవకులు గంజాయి తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, , సేవించడం, రవాణా చేయడం, చట్ట రీత్యా నేరమని తెలిపారు. ఎస్ఇబి వొచ్చే నేరములను గురించి తమకు సమాచారం ఇవ్వాలని, 14500 టోల్ ఫ్రీ నెంబర్ కి కూడా తమ పిర్యాదు లను ఇవ్వొచ్చు అని తెలిపారు.

'విశ్వాసాయి'లో ఎన్నికల సందడి

నెల్లూరు : స్థానిక మాగుంట లే అవుట్‌లోని విశ్వ సాయి ఎస్ఆర్‌కె స్కూల్లో శనివారం కోలాహలం నెలకొంది. విద్యార్థులు వారి ప్రతినిధులను ఎన్నుకునేందుకు స్కూల్ యాజమాన్యం స్కూల్ ఆవరణలో మాక్ పోలింగ్ నిర్వహించారు. బూత్‌లను ఏర్పాటు చేసి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. విశ్వ సాయి విద్యాసంస్థల చైర్మన్ ఎన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ ఎన్నిక ద్వారా విద్యార్థులకు ఓటు హక్కును వినియోగించుకునే విధానంపై అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థి దశలోనే తమ తరగతి ప్రతినిధులను (సిపి.ఎల్), స్కూల్ ప్రతినిధు (ఎస్‌పిఎల్) లను ఎన్నుకునే విధానంతోపాటు సాధారణ ఎన్నికలపై కూడా అవగాహన పెంచు కునేందుకు ఈ మాక్ ఎలక్షన్ ఉపయోగ పడుతుందన్నారు. ఓట్ల లెక్కింపు ద్వారా విజేతలను ప్రకటించిన తర్వాత విద్యార్థులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ ప్రక్రియ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని స్కూల్ ప్రిన్సిపల్ ఎస్ రఘురాం తెలిపారు. రానున్న కాలంలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కలిగించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భర్తపై ఫిర్యాదు

గుడ్లూరు : పిల్లలు పుట్టలేదని వేధిస్తూ విడాకులు ఇవ్వాలని భర్త యోహాను అత్త మామ ఆడబిడ్డ ఇంట్లో నుంచి గెంటేసారని బాధితురాలు గుడ్లూరు మండల కి పాజెర్ల గ్రామానికి చెందిన సౌజన్య శనివారం గుడ్లూరు పోలీస్ స్టేషన్లో భర్త,అత్త మామ ఆడబిడ్డ పై ఫిర్యాదు చేశారు. పాజర్ల కి చెందిన సౌజన్యని గత పదేళ్ల కిందట కావలి మండలం, వంటకి చెందిన యోహాన్ అనే వ్యక్తికి ఇచ్చి పెద్దల సమక్షంలో వివాహం చేశారు. పిల్లలు పుట్టలేదని, ఇతర కారణాలతో భార్యపై వ్యతిరేకత పెంచుకొని విడాకులు ఇవ్వాలని తరచుగా వేధిస్తూ ఉండేవాడు. వేధింపు తట్టుకోలేక బాధితురాలు సౌజన్య పోలీసుల్ని ఆశ్రయించింది దీంతో ఎస్ఐ రాములు కేసు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూడికతీత పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-నెల్లూరు : వర్షాకాలపు పరిస్థితులను దష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనులలో డ్రైను కాలువల్లో పూడికతీత పనులను క్రమంతప్పకుండా చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 23వ డివిజను పడారుపల్లి, వికలాంగుల కాలనీ, కావేరి నగర్, చలపతి నగర్, సుందరయ్య కాలనీ, ఎ, బి బ్లాకులు, అశోక్ నగర్, ఆటోవర్కర్స్ కాలనీ, బి.జే.ఆర్ కాలనీ, సప్తగిరి లే అవుట్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ శనివారం ఉదయం 6.30 గంటలకు పర్యవేక్షించారు. స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులు రెడ్డి, నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ ఉన్నారు.

మణిపూర్ ఆల్లర్లను నివారించాలి

ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కందుకూరు : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న దారుణ మారణకాండకు కారణమైన బిజెపి ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద శనివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా పట్టణ కార్యదర్శి ఎస్‌కె మల్లిక అధ్యక్షత వహించారు.ఐద్వా జిల్లా నాయకులు ఎస్కే మున్వర్ సుల్తానా మాట్లాడుతూ మణిపూర్ మహిళలను వివస్త్రను చేసి ఊరేగించడం దారుణమన్నారు. ఈ ఘటనతో దేశ పరువుప్రతిష్టలు మంటగలిశాయన్నారు. ఈ ఘటనకు ప్రధాని సిగ్గుతో తలదించుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మేధావులు, ప్రజాస్వామ్య వాదులు దేశభక్తి గలవారు అందరూ దేశంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిం చాల న్నారు. సిఐటియు పట్టణ నాయకులు ఎస్ఎ గౌస్ మాట్లాడుతూ మణిపూర్ లో 75 రోజుల నుండి మారణకాండ జరుగుతుంటే ప్రధాన మోడీ పెదవి విప్పకపోవడం దారుణ మన్నారు. అక్కడ జరుగుతున్న ఆకృత్యాలు ప్రపంచానికి తెలిసిన తర్వాత అని వార్యంగా మోడీ సన్నాయి నొక్కులు నొక్కుతున్నట్లు మాట్లాడుతున్నారన్నారు. తక్షణమే హింసను అరికట్టాలన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రిని పదవి నుంచి తప్పించాలన్నారు. ఐద్వా పట్టణ నాయ కులు ఎం పద్మ, ఎస్కే షాహిదా, సిఐటియు నాయకులు టి వెంకట్రావు ,ఎం ప్రసాద్, ఎస్ పవన్ కుమార్, డిఎం రాయుడు పాల్గొన్నారు.

లింగసముద్రంలో కొవ్వొత్తులతో ప్రదర్శన దృశ్యం

లింగసముద్రం : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన సంఘటనను ఖండిస్తూ శనివారం సామాజిక న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో లింగసముద్రంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తుల నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్గిల్ యుద్ధ సమయంలో ముందు వరుసలో ఉండి పోరాటం చేసిన సైనికుని భార్య కూడా ఆ బాధిత మహిళల్లో ఒకరు ఉండటం బాధాకరమని వక్తలు మాట్లాడారు. అనాగారికంగా ప్రవర్తించినవారిని కఠినంగా శిక్షించాలన్నారు. మాజీ ఎంపిపి పూరిమిట్ల బాలకోటయ్య,మండల కోఆప్షన్ సభ్యులు షేక్ షఫి,మాజీ సర్పంచ్ ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, నీలం బ్రహ్మారెడ్డి ,రంగయ్య, పుల్లయ్య,మైలా కేశవ రావు,కామినేని అంజయ్య, మనోహర్,పురుషోత్తం,

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఎస్ఎ గౌస్

5 కోట్ల ఆంధ్రులు సిగ్గుపడుతున్నారు..

జగన్‌కు ఇక సిఎం యోగ్యత లేదు - మాజీ మంత్రి 'సోమిరెడ్డి'

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : వైసిపి మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమనే పీకే రిపోర్టుతో ఫ్రస్టేషన్‌తో జగన్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రూ.10 కోట్ల ప్రజల సొత్తుతో ఒక్కో సభ పెట్టి ప్రతిపక్షాలు, మీడియాపై నోరు పారేసుకోవడానికా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి 2004లో దమ్ము లేకే టిఆర్ఎస్, సిపిఎం, సిపిఐతో పొత్తు పెట్టుకున్నారా..అని అడిగారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ వేసిన చార్జిషీటు చూశాక ఒక్క క్షణం కూడా సీఎం సీటులో ఉండే అర్హత జగన్ రెడ్డికి లేదన్నారు. బాబాయ్ పై గొడ్డలి పోటు వెనుక ఎవరున్నారో షర్మిల స్టేట్మెంట్ తేటతెల్లం చేసేసిందన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటేసిన ప్రజలు తలలు పట్టుకుని కూర్చుంటే, భజన చేసే నలుగురైదుగురు మంత్రులు తప్ప మిగిలిన వాళ్లందరూ ఇళ్లలో ఏడుస్తున్నారన్నారు. అధికారంలోఉన్నా ప్రతి పక్షంలో ఉన్న 18 గంటలు పనిచేసే ప్రజా నాయకులు చంద్రబాబునాయుడన్నారు. తండ్రి, బావ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటికీ బాలకృష్ణ ఏ నాడు అవినీతికి పాల్పడలేదన్నారు. తండ్రిని అడ్డంపెట్టుకొని రూ 40 వేల కోట్లు మింగేయలేదన్నారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను జైలుపాలు చేసిన చరిత్ర జగన్‌దేనన్నారు. లోకేష్ బాబును చూసి ప్రభుత్వానికి వణుకు మొదలైయిందన్నారు. పవన్ కళ్యాణ్, బాలకృష్ణ లోకేష్ సెక్యూరిటీ లేకుండా ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నారని, అలా వచ్చే ధైర్యం ఆయనకు ఉందా అన్నారు. ఏన్నో ప్రాజెక్టులు వైసిపి నిలిపేసిందన్నారు.

మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

పలుచోట్ల'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యలకు సంతప్తికర స్థాయిలో పరిష్కారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన "జగనన్న సురక్ష" పథకంతో అర్హులందరికీ సంక్షేమం సాధ్యమని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. నగర పాలక సంస్థ నగర నియోజకవర్గం పరిధిలోని 10, 53 వ డివిజనుల్లోని రామచంద్రాపురం, కోదండరామాపురం, రామ్ నగర్ - 1, నాగుల పుట్ట వీధి, వెంకటేశ్వర పురం, గాంధీ గిరిజన కాలనీ ప్రాంతాలు, రూరల్ నియోజకవర్గం పరిధిలోని 22, 34 వ డివిజన్లులోని మదర్ థెరిస్సా వీధి, బి.వి.నగర్, వేదాయపాలెం, స్నేహ నగర్, గౌతమి నగర్ -1, గౌతమి నగర్ -2, జె.వి.ఆర్ కాలనీ ప్రాంతాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. నగర శాసనసభ్యులు , విజయ డైరీ ఛైర్మన్ రంగారెడ్డి మరియు నగరపాలక సంస్థ కమిషనర్ పాల్గొని మంజూరు చేసిన టోకన్ల ఆధారంగా లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

తోటపల్లిగూడూరు : మండలంలోని వరిగొండ బిట్-2 సచివాలయం పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది.ఎంపిడిఒ కన్నం హేమలత పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉప్పల స్వర్ణలత, జెసిఎస్ కమిటీ ఇన్‌ఛార్జి తలమంచి సురేంద్రబాబు, వైసిపి కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, వైసిపి నాయ కులు గూడూరు విష్ణుమోహన్ రెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శ్రీ జ్వాలాముఖి ఆలయ ట్రస్ట్ చైర్పర్సన్ కోసూరు రవీంద్ర య్య, జెడ్పిటిసి శేషమ్మ, నెల్లి పూడి సునీల్ రెడ్డి, దశరథ రా మిరెడ్డి తదితరులు హాజరయ్యారు. తహశీల్దార్ హమీద్, ఇఒపిఆర్‌డి నారాయణ రెడ్డి, సెక్రటరీ శ్రీధర్ ఉన్నారు.

తోటపల్లిగూడూరులో..

ఉలవపాడు : ఉలవపాడు సచివాలయం-1లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ ఎల్ చంచమ్మ ,మండల తాసిల్దార్ బ్రహ్మయ్య పాల్గొని మాట్లాడారు. సర్పంచి నాగలక్ష్మి, కార్యదర్శి విజయమ్మ, జెసిబి అధ్యక్షులు ధనకోటి, ఎంపిటిసి సభ్యులు సయ్యద్ ఫైజున, రాధా మాధవి, కోప్షన్స్ సభ్యులు ఎస్కే ఖాదర్బాషా, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి కష్ణారెడ్డి, నాయకులు కోటు కోటిలింగం ,మల్లవరపు సుబ్బారెడ్డి ,బ్రహ్మయ్య ఉన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

కందుకూరు : సకాలంలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తూ ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలలలో విద్యా ప్రమాణాలు పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య చెప్పారు. శనివారం ఆయన కొండి కందుకూరు గ్రామంలోని బిసి కాలనీ, ఎస్సీ కాలనీ గౌతమ్ నగర్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండో సెమిస్టర్ కు సంబంధించిన బైలింగ్వల్ (తెలుగు -ఇంగ్లీషులో ప్రచురించిన) పాఠ్యపుస్తకాలను అందించారు. పాధ్యాయులు కరీం, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉలవపాడు: మండల పరిధిలోని పలు పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సెమిస్టర్ 2 పుస్తకాలను శనివారం నాడు పంపిణీ చేశారు .ఉలవపాడు, కరేడు జి కే జి బి వి ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ అధికారి ప్రసాద్ రావు చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. భీమవరంలో ఎంపిటిసి రమణయ్య చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ప్రసాద్ రావు మాట్లాడారు. రమణయ్య పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : టిడిపి

ప్రజాశక్తి-కందుకూరు : ఒంగోలు నగరంలో గిరిజన యువకుడు మోటా నవీన్ పై అతికిరాతకంగా దాడిచేసి నోట్లో మూత్రంపోసి చిత్రహింసలకు గురిచేసిన రౌడీమూకలను కఠినంగా శిక్షించాలని నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే పోలీసు అధికారులను కోరారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావుతో కలిసి ఒంగోలు నగరంలోని మోటా నవీన్ ఇంటి వద్దకు చేరుకొని బాధితున్ని శనివారం పరామర్శించారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రౌడీయిజం పెరిగిపోయిందని మోషే విమర్శించారు. నవీన్ కుటుంబానికి ప్రభుత్వం పరంగా న్యాయం చేయాలని, నవీన్ కు రౌడీలనుండి రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను మోషే డిమాండ్ చేశారు. పరామర్శిం చినవారిలో ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి ధర్నాసి బ్రహ్మానందం, బాపట్ల జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు ఉసురుపాటి సురేష్, ఒంగోలు నియోజకవర్గం ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు అట్లూరి వెంకటేశ్వర్లు , కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి దువ్వూరి రమేష్ చంద్ర, ఉలవపాడు మండలం తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ ఉన్నారు.

బాలకృష్ణ జోలికొస్తే నాలుక కోస్తా..

టిడిపి నేత 'కోటంరెడ్డి' హెచ్చరిక

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : నందమూరి బాలకష్ణ జోలికి వచ్చినా.. అనుచిత వ్యాఖ్యలు చేసినా నాలుక కోస్తానని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సిఎం వైఎస్ జగన్‌ను హెచ్చరించారు.. వెంకటగిరిలో జరిగిన బహిరంగ సభలో జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.. తన తల్లి క్యాన్సర్ తో మరణిస్తే.. బసవతారకం హాస్పిటల్ ఏర్పాటు చేసి నిరుపేదలకు ఉచితంగా ట్రీట్మెంట్ చేస్తున్న గొప్ప వ్యక్తి బాలకష్ణ అని ఆయన అన్నారు. నువ్వు చంపేస్తానని భయపడి..నీ చెల్లి నీ తల్లి ప్రాణ భయంతో తెలంగాణ రాష్ట్రానికి పారి పోయిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని జగన్మోహన్ రెడ్డి వేలకోట్లు సంపాదించారని.. 11 కేసుల్లో ముద్దాయిగా ఉంటూ 16 నెలలు చిప్ప కూడు తిన్నారని విమర్శిం చారు.. నందమూరి, నారా కుటుంబాలు 30 ఏళ్ల రాష్ట్రాన్ని పాలిస్తే ఒక్క అవినీతి మరక కూడా లేని నిస్వార్థ పరులు బాలకష్ణ అని కోటంరెడ్డి అన్నారు.. ప్రజాసేవ తప్ప.. అవినీతి, అక్రమాలు బాలకష్ణకు తెలియవన్నాఉ. బాలకష్ణ పై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే నాలుక కోస్తామని... రాష్ట్రంలో తిరగనివ్వకుండా అడుగడుగునా అడ్డుకుంటామని కోటంరెడ్డి హెచ్చరించారు.. నగర అధ్యక్షులు మమిడల మదు,మాజీ కార్పొరేటర్ కపిరి శ్రీనివాసులు, కువ్వరపు బాలాజీ, ఆకుల హనుమంతు రావు,పసుపులేటి మల్లిఖార్జున,వినుకుల్ సుధాకర్ రాజు, తబి సుజన్ కుమార్ పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతోన్న టిడిపి నేత కోటంరెడ్డి

'యువగళం' పాదయాత్రలో 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు : ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో జరుగు తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ప్రకాశం జిల్లా ఎంఎల్ఎలు, ఇన్‌ఛార్జులు, ముఖ్య నేతలతో కలసి కందుకూరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. లోకేష్‌తో కలిసి నాగేశ్వరరావు నడిచారు.

టిడిపి ఇంటిగ్రేటెడ్ శిక్షణ

ప్రజాశక్తి-కావలి: కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు అధ్యక్షతన అల్లూరు మండల టిడిపి కార్యాలయంలో ముఖ్య నాయకులు బీద గిరిధర్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో నియోజకవర్గపార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర సమక్షంలో ఆర్గనైజ్ కావలి నియోజకవర్గ కోఆర్డినేటర్ తుమ్మల హరీష్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి బూతుకి వెళ్లి ఓటర్లను వెరిఫై చేసే కార్యక్రమానికి మన పార్టీ తరఫున నియమించబడ్డ బూత్ లెవల్ ఏజెంట్లు వెళ్లి అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలపాలని సూచించారు. సమావేశంలో ముఖ్య నాయకులు ఉపాధ్యక్షులు బుర్రా కష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి పంగాలి శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఆప్కాబ్ చైర్మన్ కొండూరు పాల్ శెట్టి, బండి శ్రీనివాసులు రెడ్డి, రామిశెట్టి కష్ణ చైతన్య, రమణయ్య, అంబటి రాజేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: మండలంలోని మహిమలూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వాసిలి, దేపూరు, అశ్వినిపురం గ్రామాలను నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ శనివారం సందర్శించారు. ఆయా గ్రామాల్లోని జెడ్‌పిహెచ్‌ఎస్, ఎంపీపీ స్కూళ్లను సందర్శించి అక్కడ ఉన్న పిల్లలకు ఫ్లోరోసిస్ లక్షణాలు ఏమైనా ఉన్నాయా అని పరీక్షించారు. పొగాకు వలన కలిగేటువంటి దుష్ఫలితాల మీద గురించి పిల్లలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ దివ్య హాసిని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మహిమలూరు డాక్టర్ వి.అనూష కుమారి, ఎంఎల్‌హెచ్‌పి, మల్లెం కొండయ్య, సుగుణ, నాగేశ్వరి, జిలాని బాషా, ఆశాలు పాల్గొన్నారు.

"ఆరోగ్యమే మహాభాగ్యం"

ప్రజాశక్తి-కావలి: ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రముఖ డాక్టర్లు తెలిపారు. పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాపిశెట్టి. జానకిరామ్ ఆధ్వర్యంలో శ్రీసాయివిద్యా నికేతన్ ఇ.ఎమ్. హైస్కూల్‌లో "ప్రిజర్వేడ్ ఫుడ్స్ (జంక్ ఫుడ్స్) వలన కలిగే నష్టాలు", అదేవిధంగా "తాజాగా తయారు చేసుకున్న హోంఫుడ్ తీసుకోవడం వలన కలిగే లాభాలు" "ఆరోగ్య పరిరక్షణ- సీజనల్ వ్యాధులు "గురించి ఈ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన కావలి పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్లు ఎస్.రేవంత్, ఎస్.రమ్యలు మాట్లాడారు. విద్యార్థులు తినుబండారాలూ పిజ్జాలు, బర్గర్లు, నూడిల్స్ తదితర జంక్ పదార్థాలు తీసుకుంటున్నారన్నారు. వీటినిఎక్కువ కాలం నిల్వచేసేందుకు వాడే కెమికల్స్, పిల్లలకు హానికరం చేస్తున్నాయన్నారు. వీటికి బదులుగాఇంట్లో తాజాగా అమ్మ వండే ఆహార పదార్థాలు తీసుకొని ఆరోగ్యం పరిరక్షించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధుల గురించి మాట్లాడిన వైద్యులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీసాయివిద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ కట్టి. కష్ణారావు, అలివేలమ్మ, జన విజ్ఞాన వేదిక కోశాధికారి టి .సుబ్బారామయ్య, ఉపాధ్యక్షులు కందికట్ల. నారాయణ, కార్యదర్శి సభ్యులు కె. హరినారాయణరెడ్డి, సీనియర్ సభ్యులు కల్యాణ్, కె.జాన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాస్తవాలు మాట్లాడితే ఉలుకెందుకు

ప్రజాశక్తి-కొడవలూరు: వెంకటగిరి సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాస్తవాలు మాట్లాడితే ఉలిక్కిపడుతున్నారెందుకని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, పవన్, లోకేష్ బాబు, బాలయ్యలను ప్రశ్నించారు. మండలంలోని పాత వంగల్లులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సభలో ముఖ్యమంత్రి వందశాతం నిజాలే మాట్లాడారని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ నాలుగు పెళ్లిళ్లు చేసుకోవడం వాస్తవం కాదా అన్నారు. లోకేష్ ఛడ్డీ తొడుక్కొని తాగుతూ మహిళలతో స్విమ్మింగ్ పూల్ కులుకులు వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. చేసిన తప్పులను వేలెత్తి చూపితే మా నేతను విమర్శించడమేంటని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు వీరచలపతిరావు, వైసిపి మండల కన్వీనర్ గంధం వెంకట శేషయ్య, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ వి.లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఘరానా మోసం

లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: పురపాలక పరిధిలోని నెల్లూరుపాలెంలో శనివారం ఓ ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు పురపాలక పరిధిలోని నెల్లూరుపాలెం సెంటర్లో ఆత్మకూరు పురపాలక పరిధిలోని నెల్లూరు పాలెంలో మక్కెన రోశయ్య అనే వ్యక్తికి చెందిన ఇంటిని బద్వేల్‌కు చెందిన భాస్కర్ రెడ్డి అద్దెకు తీసుకున్నాడు. ఈ ఇంట్లో తాను సిగరెట్ల హోల్ సేల్, చక్కెర వ్యాపారం చేస్తానని స్థానికులందరిని నమ్మబలికాడు. కొందరితో స్నేహం చేసి డబ్బులు తీసుకుని మళ్లీ తిరిగి ఇస్తూ వారందరిని నమ్మకాన్ని కూడగట్టాడు. సిగరెట్ కంపెనీలో షేర్ ఇస్తానని పలువురి వద్ద నుండి సుమారు రూ.4 కోట్ల వరకు నగదు వసూలు చేశాడు. తాను అద్దెకుంటున్న మక్కెన రోశయ్య కలసి కంపెనీకి సంబంధించిన కాగితాలు తీసుకొద్దామని చెప్పి మధ్యాహ్నం వెళ్దామని నమ్మబలికాడు. శివయ్య మధ్యాహ్నం వరకు వేచి చూసి ఎంత వరకు భాస్కర్ రాకపోవడంతో అతని ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. ఫోన్ చేసిన ఎవరూ స్పందించకపోవడంతో అనుమానం వచ్చి పలువురిని విచారించాడు. ఎవరూ తమకేమి తెలియదని చెప్పడంతో తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఇంటి తాళాలు పగలగొట్టి లోపల చూడగా ఏమి కనిపించలేదు. భాస్కర్ అందరిని నమ్మించి రూ.4కోట్లతో పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి: రెండవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి పంపిణీ చేశారు. శనివారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కుర్రపల్లి పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రార్థనా సమయానికి పాఠశాల చేరుకొని విద్యార్థులకు రెండవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థుల పఠన అభ్యసన సామర్థ్య నైపుణ్యాలను పరిశీలించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రార్థన గీతాలను రాగయుక్తంగా పాడే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తగు శిక్షణ ఇవ్వాలన్నారు. రెండవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేస్తూ పాఠ్యపుస్తకాలు చినిగిపోకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల పఠన అభ్యసన సామర్థ్య నైపుణ్యాలను పరిశీలిస్తూ చదువు కంటే ముందుగా మంచి క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. అప్పుడే విద్యార్థులు చదువులో సులువుగా రాణించగలరని తెలిపారు.విద్యార్థులు పాఠశాలలో ఇంటి వద్ద క్రమశిక్షణగా ఉండే విధంగా ఉపాధ్యాయులు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

జాశక్తి-కోవూరు: మండలంలోని పోతిరెడ్డి పాలెం గ్రామంలో జరుగుతోన్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు ఏడు వారాల నుంచి కూలి డబ్బులు రావాలని తెలిపారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ నెలల తరబడి కూలీలు చేత పని చేయించుకుని కూలి డబ్బులు విడుదల

కూలీలతో మాట్లాడుతున్న ఎం.పుల్లయ్య

చేయకపోవడం బాధాకరమన్నారు. పేదలు పనికి వెళ్లి కూలి డబ్బులు తెచ్చుకొని జీవితం గడుపుకుంటున్నారన్నారు. అలాంటి కూలీలకు ఈ విధంగా వారాల తరబడి కూలి డబ్బులు ఇవ్వకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. తక్షణమే ఉపాధి హామీ కూలి బకాయలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓవైపున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి పేదలకు అందకుండా చేయాలని కుట్ర పన్నుతున్నాయన్నారు. అందుకే నిధులు కూడా నామమాత్రంగా విడుదల చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. పేదలకు జీవనాధారమైనటువంటి ఈ ఉపాధి హామీ చట్టాన్ని నిధులు పెంచి పేదలకు బతుకుపై భరోసా కల్పించే విధంగా ఈ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమం కులవివ క్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను ఉపయోగించుకోవాలి

ఆత్మకూరులో

మర్రిపాడులో

ఉదయగిరిలో

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కంపసముద్రం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఆనందరావు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మాజీ కన్వీనర్ గంగ వరపు శ్రీనివాసులు నాయుడు మాట్లా డుతూ మండలంలో 17సచివా లయాలు ఉన్నాయన్నారు. 15గ్రామ సచి వాల యాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించా మన్నారు. కంపసముద్రం, చాబోలు గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులకు రూ.10కోట్ల 9లక్షలు వారి ఖాతాల్లో జమ అయిందన్నారు.జగనన్న సురక్ష శిబిరాల్లో ఎటువంటి ఛార్జీలు వసూలు చేయకుండా 11రకాలైన సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందిస్తున్నారు. కంపసముద్రం చాబోలు గ్రామాలలో 1658స ర్టిఫికెట్లు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మస్తాన్

కావలిరూరల్‌లో

ఖాన్, వైసిపి మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, గుండుబోయిన వెంగయ్య, మాధవరెడ్డి,కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. శనివారం మండలంలోని మురగళ్ల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పువ్వాడి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు అత్యంత ఉపయోగకరమైన 11 రకాలైన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. వారం రోజుల నుంచి వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామంలోని అన్నీ గహాలను సందర్శించి నిర్వహించిన సర్వే ద్వారా 817 మంది ప్రభుత్వ సేవలను ఉపయోగించుకోవడం జరిగిం దని తెలిపారు.కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎఒ కిషోర్ శిరీషా, వెలుగు ఎపిఎం వెంకమ్మ, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, స్వయం సహాయక గ్రూపుల సభ్యులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉదయగిరిలో

మండల పరిధిలోని జి.చెరువుపల్లి గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ పేర్నపాటి గీత అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్, సర్పంచ్ గీత మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం పేదలకు వరం లాంటిది అన్నారు. ఇంతకు ముందులా కాకుండా ఇంటి వద్దకే జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. 11 సూత్రాల సర్టిఫికెట్స్ పొందే భాగ్యం ఈ జగనన్న సురక్ష కార్యక్రమంలో కల్పించబడుతుందన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్ వి.జగదీష్ బాబు, ఇన్చార్జ్ ఎంపీడీఓ మల్లికార్జున,కల్లూరి రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి డిడిఓ శ్రీనివాసులు, కార్యదర్శులు ఖాదర్ కరిముల్లా, ఆంజనేయులు సచివాల సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలిరూరల్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందించడమే జగనన్న -సురక్ష కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తాళ్లపాలెం సర్పంచ్ సురేష్ పేర్కొన్నారు. తాళ్లపాలెం గ్రామ సచివాలయంలో జగనన్న -సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా తహశీల్దార్ మాధవరెడ్డి ,ఎంపీడీఓ ఏవి మోహన్ రావు మాట్లాడారు.ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడారు. అనంతరం 1830 సర్టిఫికెట్లను గ్రామ ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయల కన్వీనర్ శ్రీనివాసులు, సెక్రటరీ సమ్మత్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

టిడిపి బూత్ స్థాయి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ఎన్నికల కమిషన్ ఇచ్చిన వెసులుబాటును బిఎల్‌ఒలు ఏమరపాటు లేకుండా బాధ్యతగా వ్యవహరించాలని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శ్రీధర్ గార్డెన్‌లో టిడిపి బూత్ లెవెల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ నారాయణరెడ్డి, శిక్షణ తరగతులను ప్రారంభించారు. సందర్భంగా వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి 278 మంది బిఎల్వోలు గాను 259 మంది శిక్షణకు హాజరయ్యారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన వెసులుబాటును బి ఎల్‌ఓలు ఏమరపాటు లేకుండా రాష్ట్ర అబ్జర్వ్ ఇచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని శిక్షణను దష్టిలో ఉంచుకొని బూతు లెవల్ లో పనిచేయాలని

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆనం

సూచించారు. టిడిపి అభ్యర్థి విజయానికి బిఎల్‌ఓ లు చేసే కషి మొట్టమొదటి విజయం చేకూరుతుం దన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, సెంట్రల్ పార్టీ ఇన్‌ఛార్జ్ రాజశేఖర్, ఆత్మకూరు నియోజకవర్గం పరిశీలకులు బుల్లెట్ రమణ, తెలుగు మహిళ రాష్ట్ర పులిమి శైలజా రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, చంద్ర వెంకటసుబ్బ నాయుడు , సుంకర పెంచలయ్య చౌదరి , కేత విజయభాస్కర్ రెడ్డి వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందజేయాలి

ప్రజాశక్తి-కావలి: పంటల బీమా సొమ్ము స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని, రీకవరీ చేసి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని సిపిఎం కావలి, జలదంకి మండలాల ఇన్‌ఛార్జి తాళ్లూరు మాల్యాద్రి, సిపిఐ జలదంకి మండల నాయకులు దమ్ము దర్గాబాబు, డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం కావలి ఆర్‌డిఒ కార్యాలయంలో డిఏఓ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తాళ్లూరుమాల్యాద్రి మాట్లాడుతూ జలదంకిమండలం, బ్రాహ్మణక్రాక గ్రామంలో అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం నిమిత్తం ప్రభుత్వం రూ.78,97,420.లు బీమా సొమ్ము

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మంజూరు చేసిందన్నారు.పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించకుండా గ్రామంలో కొంత మంది రాజకీయ నాయకులకు తలొగ్గి, ఎటువంటి పంట వేయని, అర్హత లేని రైతులకు విలేజ్, వ్యవసాయ అధికారిణి, వాలంటీర్ కలసి అర్హులు కాని వారి ఖాతాలో వేసి సొమ్ము స్వాహా చేశారని తెలిపారు. పంట బీమా సొమ్ము కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సదరు సొమ్ము రీకవరీ చేసి, పంటనష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం కావలి మండల అధ్యక్షులు పేముల సీతారామయ్య, రైతు సంఘం నాయకులు ఎస్.మధు, ఎం.శ్రీనివాసులు, మాధవరపు మహేష్, ఎస్.మధు పాల్గొన్నారు.

చంద్రబాబును సిఎం చేయడమే ధ్యేయం

ప్రజాశక్తి-కావలి: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సగౌరవంగా ప్రవేశపెట్టిన "మహాశక్తి కార్యక్రమం" శనివారం కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో తెలుగు మహిళలతో అట్టహాసంగా"మహాశక్తి కార్యక్రమం"ప్రారంభించారు.తొలుత మద్దూరుపాడులోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆయనతోపాటు మహిళలందరూ కలిసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మహిళలకు ఏర్పాటు చేసినటువంటి "మహాశక్తి "వాహనంలో బయలుదేరి ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహిం చారు. అనంతరం అందరూ కలిసి మహిళలతో" రచ్చబండ కార్యక్రమం" నిర్వహించారు. మాలేపాటి నాయకత్వం వర్ధిల్లాలి!, మహాశక్తి వర్ధిల్లాలి! అంటూ మహిళలు నినాదాలు చేశారు.చంద్రబాబు ప్రకటించినటువంటి మినీ మేనిఫెస్టోలో మహిళలకు ఉన్న సౌలభ్యాలను అందరికీ అర్థమయ్యేలా వివరించారు. మహిళలపై

మహాశక్తిని ప్రారంభిస్తున్న దృశ్యం

జరుగుతున్న అన్యాయాలకు వైసిపిప్రభుత్వమేకారణమంటూ మహిళ నేతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ద్రోణాదుల వాసంతితో పాటు కొల్లూరు అశ్విని, పసుపులేటి పద్మ, రాధమ్మ, కట్టమూరు శ్రీదేవి, బత్తమ్మ, సుప్రజ, శ్రీలక్ష్మి, అమర జ్యోతి, మద్దూరుపాడులోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కొండ వెంకట్రావు, కొమర వెంకటేశ్వర్లు, పిలిమిట్ల సుబ్రహ్మణ్యం మరికొంతమంది మహిళలు పాల్గొన్నారు..

రుద్రకోటలో మహాశక్తి టీం పర్యటన

ప్రజాశక్తి-కావలిరూరల్ : నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశాల మేరకు మహాశక్తి మహిళ టీం ఈరోజు రూరల్ మండలంలోని రుద్రుకోట గ్రామంలో పర్యటిం చారు. మహాశక్తి వాహన ంలో బయలుదేరిన మహిళల టీం రుద్రకోట గ్రామంలో ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం వారు మహిళలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా చంద్రబాబు నాయడు ప్రకటించినటువంటి మినీ మేనిఫెస్టోలో మహిళలకు ఉన్న సౌలభ్యాలను అందరికీ అర్థమయ్యేలా వివరించారు. మన రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘత్యాలకు వైసిపి ప్రభుత్వమే కారణమంటూ మహిళ నేతలు తెలిపారు. కార్యక్రమంలో ద్రోణాదుల వాసంతి, కొల్లూరు అశ్విని, పసుపులేటి పద్మ, రాధమ్మ, కట్టమూరు శ్రీదేవి, బత్తమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు మోటార్లు చోరీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మండలంలోని బండారిపల్లి గ్రామంలో అర్ధరాత్రి పొలాల్లో దొంగలు బీభత్సం సష్టించారని బాధిత రైతులు బాధితులు తెలిపారు. వివరాల మేరకు.. బండారుపల్లి గ్రామంలో అర్ధరాత్రి పొలాలలో చొరబడి 5 మోటార్లు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. మరో ఐదు మోటర్లు రాకపోవడంతో ధ్వంసం చేసి వెళ్లినట్లు రైతులు తెలిపారు. మోటర్లు ఎత్తుకెళ్ల డంతో రెండవ కారు పంట ఎండిపోతాయని రైతులు ఆందోళన చేస్తున్నారు. ఒక్కొక్క మోటార్ విలువ 50 వేలు విలువ చేస్తుందని తెలిపారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

ఇంద్రసేనారెడ్డికి ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-ఉదయగిరి: ఎస్‌పి డాక్టర్ తిరుమలేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శుక్రవారం రాత్రి నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన జిల్లా నేర సమీక్ష సమావేశంలో ఎస్ఐని అభినందించి ఎస్‌పి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఎస్ఐగా విధులు చేపట్టిన అనంత కాలంలోనే అరుదైన అవార్డు ఎస్‌పి చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఉచితంగా మందులు పంపిణీ

ప్రజాశక్తి-కలిగిరి : ఆరోగ్య సేవలు ఎంతో ఉపయోగకరమని కాకర్ల ట్రస్టు సభ్యులు తెలిపారు. 62వ రోజు "సంజీవని ఆరోగ్య రథం"ఉదయగిరి నియోజక వర్గం మండలంలోని కష్ణారెడ్డి పాలెం పంచాయతీ రాజుపాలెం ఎలిమెంటరీ స్కూల్ వద్దకు వచ్చింది. అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీతో కూడిన వైద్య సేవలందించారు.

కోటి కుంకుమార్చన మహాయజ్ఞం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : 19 నుండి తేదీ 29 వరకు జరుగుతోన్న కోటి కుంకుమార్చన మహాయజ్ఞం సందర్భంగా దేవస్థాన ఛైర్మెన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు అధ్వర్యంలో కోటి కుంకుమార్చన పూజ అత్యంత వైభవంగా శనివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నాల్గవ రోజుశనివారం ఉదయం ఉభయకర్తలకు ఆహ్వానం, గోపూజ, వషభార్చన, లక్ష్మి గణపతి పూజ, శ్రీ స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి నవావరణ పూజ కార్యక్రమములు ఆలయ అర్చకులు నిర్వహించారు.ఉభయకర్తలుగా రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ధర్మపత్ని ప్రశాంతి దంపతులు మనుబోలు వాస్తవ్యులు చెన్నూరు నరేశ్ రెడ్డి శ్రీలక్ష్మి దంపతులు పాల్గొన్నారు

అత్యాచార ఘటనపై నిరసన

ప్రజాశక్తి-బిట్రగుంట : మణిపూర్ హింసాకాండపై, గిరిజన మహిళలను నగ్నంగా ఒరేగించి అత్యాచారం చేసిన ఘటనపై శనివారం జై భీమ్ అంబేద్కర్ సేవాదళ్ ఆధ్వర్యం బోగోలు బజాజ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ కో ర చంద్రశేఖర్, జై భీమ్ అంబేద్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర, బిట్రగు ంట అభివద్ధి కమిటీ అధ్యక్షుడు ఎస్ కె నూరుద్దీన్, దళిత సంరక్షణ జిల్లా అధ్యక్షులు ఎస్ మా ల్లి, ప్రకాశం జిల్లా మానవ హక్కుల జిల్లా అధ్యక్షులు సునీల్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివా సులు ,జీకర్, సుభాని, నిర్మల్, వీరం బొట్లు, ఆవుల సురేష్, రమణయ్య, పాల్గొన్నారు.

చిరంజీవి యువత అధ్యక్షులుగా 'చేగు'

ప్రజాశక్తి-కావలి: నియోజకవర్గ చిరంజీవి యువత, పవన్ కళ్యాణ్ ఫాన్స్ అధ్యక్షులను శనివారం నియమిచడం జరిగింది. కావలి నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులుగా చేగు నారాయణని, నియోజక వర్గ పవన్ కళ్యాణ్ అధ్యక్షులు ఆలాశ్రీనాథ్‌ని రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్, కష్ణ రెడ్డి చింతాల వెంకట్రావు ఆధ్వర్యంలో నియమిచడం జరిగింది. కార్యక్రంలోచిరంజీవి,పవన్ కళ్యాణ్ ఫాన్స్ పాల్గొన్నారు.

పర్మినెంట్ చేసేంత వరకూ పోరాటం..!

ప్రజాశక్తి-నెల్లూరు+రాష్ట్రంలోని నగర పాలక, మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేసేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామని సిపిఎం నాయకులు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేయడం, అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. ప్రభుత్వం నుంచి, అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో తమ విధులకు భద్రత కల్పించే వరకు తాము చేస్తున్న పోరాటం ఎట్టి పరిస్థితుల్లో నిలిపేదే లేదంటు మున్సిపల్ కార్మికులు గట్టిగా తమ వాధనలను ప్రభుత్వానికి వినిపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే కార్మికులు నిరవధిక సమ్మెకు సైతం వెనకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. తమ ఉద్యోగాలకు భద్రత కల్పించకపోతే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామంటూ ఆందోళన కార్యక్ర మాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్ళు పూర్తి అవుతున్న పర్మినెంట్ చేసే దిశగా ఏ రకమైన చర్యలు చేపట్టలేదన్నారు.

వీక్షణం

వ ం ఎ న్ని వ ల్

కార్మికులను మోసం చేసిన గత ప్రభుత్వాలు ఏవి కూడా మనుగడలో లేవంటూ తమ వాధనలు గట్టిగా వినిపిస్తున్నారు. కలెక్టోరేట్‌ను సైతం ముట్టడి చేస్తామంటున్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కరిస్తుందా.. లేక ఉద్యోగ, ఉపాధ్యాయులను ఏ తరహాలో అణిచివేసే ప్రయత్నం చేసిందో అదే విధంగా వ్యవహరిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ఇటీవల మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానుషకాండను నిరసిస్తూ వామపక్షపార్టీలు తీవ్ర స్థాయిలో ప్రదర్శనలు చేపట్టి కేంద్ర ప్రభుత్వా పాలనపై విమర్శలు గుప్పించాయి. బిజేపి ప్రభుత్వం రిజర్వేషన్లపై అర్థరహితమైన ప్రకటనలు చేస్తూ ప్రజల మధ్య ఘర్షణ వాతా వరణం సృష్టిస్తుందనేందుకు ఇది ఒక చక్కటి ఉదాహరణగా కనిపిస్తుంది. ప్రభుత్వ వైద్యశాలలో ఒకే రోజు ఆరుగురు మృతి చెందారు. ఈ ఘటనపై కలెక్టర్ స్పందించి హుటాహుటిన జిజిహెచ్‌కి చేరుకున్నారు.

1057 పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని డిసి పల్లి పొగాకు వేలం కేంద్రానికి నెల్లూరు పాలెం క్లస్టర్‌కు చెందిన రైతులు 1089 పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకొచ్చారు.వీటిలో 1057 బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో12బేళ్ల ను తిరస్కరిం చారు.వీటిలో ఎన్ఎస్ 05, ఎన్ బి 02, బి ఆర్ 01ఉన్నాయి.అధిక బరువుతో ఉన్న20 పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర 250రూపాయలు కాగా కనిష్ఠ ధర 150రూపాయలు.సగటు ధర239.28 నమోదు కాగా, వేలంలో 13మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

విద్యార్థులకు స్కాలర్ షిప్పులు

ప్రజాశక్తి-కావలి: బిటెక్, ఎం.బి.ఎ., ఎం.సి.ఎ.లకు కౌన్సిలింగ్ అయిపోయిన, చదువుతున్న బలిజ విద్యార్థులకు బలిజ – కాపు సంక్షేమ సంఘం వారు రూ.5వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.. వివరాలకు తోట వెంకట శేషయ్య, అధ్యక్షులు, బలిజ – కాపు సంక్షేమ సంఘం, సెల్965296 7025,:9390967477లను సంప్రదిం చాలని నిర్వాహకులు తెలిపారు.

పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి-కావలి: పవన్ కళ్యాణ్ అడిగిన ప్రశ్నలకు దమ్ము, ధైర్యం లేకపోవడం వల్లే జగన్ చెత్తగా మాట్లాడుతున్నారని జనసేన పార్టీ కావలి నియోజక వర్గం ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ ఖండించారు. శనివారం స్థానిక 'జర్నలిస్ట్ క్లబ్'లో అయన ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడారు.సమావేశంలో జనసేన జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య, పట్టణ అధ్యక్షులు పొబ్బ సాయి విఠల్, అధికార ప్రతినిధి మన్నెపల్లి రిషికేష్, పవన్, కళ్యాణ్, ఫాన్స్, అధ్యక్షులు ఆలాశ్రీనాథ్, గడే నాగార్జున, పోకల రఘు, వి.ప్రవీణ్ కుమార్, ఆది, మహేంద్ర, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

26న సమీక్ష సమావేశాలు

ప్రజాశక్తి-కావలి: కావలి, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షా సమావేశాలు ఈనెల 26న జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం. హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షతన, జిల్లాకు చెందిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆయా నియోజకవర్గాల శాసనసభ్యుల సమక్షంలో జరిగే ఈ సమీక్ష సమావేశాలకు జిల్లాస్థాయి అధికారులు అందరూ పూర్తి సమాచారంతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం, మధ్యాహ్నం మూడు గంటలకు కావలి అసెంబ్లీ నియోజకవర్గం సమావేశం నిర్వహించ నున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి, ఆయా నియోజకవర్గాల మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశాలకు హాజరుకావాలని స్పష్టం చేశారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

ప్రజాశక్తి-ఉదయగిరి: గండిపాలెంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి వెంకటరమణ విచారణ చేపట్టారు. శనివారం మండల పరిధిలోని గండిపాలెం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పై కావలి డిఎస్‌పి ఎం.వెంకటరమణ ఘటన ప్రదేశంలో విచారణ చేపట్టారు. జూన్ 11వ తేదీన గండిపాలెంలోని రామా లయం వద్ద గ్రామస్తులు సమావేశం నిర్వహించి ఓ దినపత్రికలో పనిచేసే దళిత విలేకరిపై కులం పేరుతో దూషిస్తూ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశం అంతా సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడంతో వైరల్ కావడంతో మనసు నొచ్చుకున్న బాధితుడు ఉదయగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా కావలి డిఎస్‌పి గ్రామంలో జరిగిన సంఘట ప్రాంతానికి చేరుకొని పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించారు.

సబ్ జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి: కావలి సబ్ జైలులో మండల న్యాయ సేవా అధికారిక సంస్థ (లోక్ అదాలత్) ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వరలక్ష్మి ఈ సందర్భంగా ఖైదీలకు కొన్ని చట్టాల గురించి వివరించారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు కోరితే లోక్ అదాలత్ ద్వారా న్యాయ వాదిని నియమించి, న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఖైదీలు మానసిక పరివర్తన పొందాలని, నేర ప్రవత్తి మానుకుని సమాజంలో మంచి పౌరులుగా తయారు కావాలని కోరారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబెర్, న్యాయవాది జె. శ్రీదేవి, జైలు సూపరింటెండెంట్ చిన సుబ్బయ్య, జ్యూడిషియల్, సబ్ జైలుసిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
గూడూరు
O.S.NO. 179 / 2019
వి. రాధకృష్ణారెడ్డి ......వాది
Vs
1. మీరా రెడ్డి మరియు ఇతరులు ....ప్రతివాదులు
నోటీసు
టు, డి7. గ్రంధి వంశీకృష్ణా, S/o సత్యనారాయణ, అనంతమడుగు, సైదాపురం మండలం, నెల్లూరు జిల్లా.
వాది పై దావా మీ మీద దాఖలు చేసి యున్నందున మీకు పై దావా మరియు పిటిషన్ నెం.241/2019 మీకు నోటీసుకు గాను తేది. 10-08-2023 న వాయిదా ఉన్నందున మీరు ఉదయం 10 గంIIలకు పైకోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెల్పుకోనియెడల, మీ పరోక్షమున దావా మరియు పిటిషను తీర్మానించ బడునని తెలియజేయడమైనది.
ఇట్లు,
పి. భాస్కర్ రావు, వాది యొక్క అడ్వకేట్